## స్కూల్ పిల్లలకు బ్లాంకెట్లు పంపిణీ



నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్ ఆగాపురాలో ఉన్న బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ బ్లాంకెట్లను, స్కూల్ బ్యాగ్‌లను అందజేశారు.ఈకార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ పాల్గొన్నారు.– *మెహిదీపట్నం, డిసెంబర్ 28*

## దేవుడు చేసిన బొమ్మ నాటక ప్రదర్శన



దేవుడు చేసిన బొమ్మ నాటకంలో నటిస్తున్న కళాకారులు

రవీంద్రభారతి, డిసెంబర్ 28: రసరంజని హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో దర్శకత్వం మోహన్ సేనాపతి, రచన శ్రీశైలమూర్తి రూపొందించిన 'దేవుడు చేసిన బొమ్మ నాటకం' రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. దేవుడు చేసిన బొమ్మ నాటకం సారాంశం సాంకేతిక రంగంలో సృష్టికి ప్రతిసృష్టికి ప్రతిసృష్టి చేసే స్థాయికి మానవుడు వెళ్లిపోయాడు. మనిషి గొంతుని, ముఖాన్ని ఆకారాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఈనాడు సృష్టిస్తున్నాడు. ఇదంతా ముందు ఊహించినదేనా? జూల్స్ వెర్న్, వెచ్‌జివెల్స్, బజాక్ అసియోవ్, మైకేల్ క్రిక్‌టన్, యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది వెంకటకృష్ణమూర్తి.. ఇంకా చాలా మంది తమ నవలల్లో భవిష్యత్‌ని ఊహించి రాసి ప్రశంసలు పొందారు. కానీ ఇలాంటి ఇతివృత్తిలో తెలుగులో నాటకం రాలేదు. 2002 సంవత్సరంలో దేవుడు చేసిన బొమ్మ అనే నాటకం మొట్టమొదటి సారిగా రసరంజనిలో ప్రదర్శించినప్పుడు మరో వందేళ్ల తర్వాత జరిగే నాటకానికి ఎన్నో అవార్డులు ప్రశంసలు లభించాయి. ఈ నాటకంలో సందీప్, అల్లెన వెంకటరమణమూర్తి, అన్వేష, డాచి డొక్కా, పీటర్ కెకెరెడ్డి తదితరులు నటించారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే కోరుకున్న గమ్యానికి చేరుకుంటారని అమెరికాకు చెందిన ప్రవీణ్ కంటిపూడి టీసీఎస్ గ్లోబల్ హెడ్ ఇన్‌చార్జి శ్రీనివాస్ ద్రోణం రాజు పేర్కొన్నారు. రతన్ టాటా జన్మదినాన్ని పురస్కరించుకొని టీసీఎస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మహిమ మినిస్ట్రీస్ ఎన్జీఓకు చెందిన పిల్లలకు బ్యాగులు, స్వెట్టర్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కష్టించి చదివితే ఉన్నత ఉద్యోగాలను సాధించగలుగుతారన్నారు. నేటి ఆధునిక యుగంలో సాఫ్ట్‌వేర్ రంగానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, సాఫ్ట్‌వేర్‌లో రాణించేందుకుగాను అత్యాధునిక కోర్సులను అభ్యసించాలని వారు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖేశ్, వినోద్, నిమేష శర్మ తదితరులు పాల్గొన్నారు.

*– అబిడ్స్, డిసెంబర్ 28*

## గుండెపోటుతో..



రాజేశ్(ఫైల్)

కార్వాన్, డిసెంబర్28 : గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన టప్పాచబుత్రా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, మృతుడి బంధువులు తెలిపిన ప్రకారం.. జాఫర్‌గూడాకు చెందిన మూటె రాజేశ్(42) హెచ్‌సీయూలో ఉద్యోగి. బుధవారం సాయంత్రం తన బంధువుల అంత్యక్రియలకు వెళ్లి ఇంటికి వస్తుండగా ఇంటి కొద్ది దూరంలో ఒక్కసారిగా ద్విచక్రవాహనం పైనుంచి పడిపోయాడు. స్థానికులు వెంటనే 108 వాహనంలో దవాఖానకు తరలించే లోపు మృతి చెందాడు. రాజేశ్ మృతితో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



లంగర్‌హౌస్ వార్డు కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్



ప్రజా పాలనలో ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్

# అందని ఐదు గ్యారంటీల దరఖాస్తులు

- గందరగోళంగా ప్రజా పాలన
- భారీగా తరలివచ్చిన జనం
- ఉచిత దరఖాస్తు ఫారాలు దొరక్క సిబ్బందిపై ఆగ్రహం
- జీరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలకు జనం పరుగులు
- దళారుల చేతిలో రూ.10 నుంచి వంద వరకు ఫారాల విక్రయం
- చాలాచోట్ల సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డ ప్రజలు

మెహిదీపట్నం/కార్వాన్/చాంద్రాయణగుట్ట/సుల్తాన్ బజార్/అబిడ్స్/జియాగూడ, డిసెంబర్ 28 : ప్రభుత్వం నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమం గురువారం కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల్లో గందరగోళం మధ్య ప్రారంభమైంది. ఉదయం 8 గంటలకు ప్రారంభించేందుకు వచ్చిన అధికారులు ప్రజలకు దరఖాస్తు ఫారాలు ఇవ్వడానికి ఆలస్యం చేశారు. పలు కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలు లేక ప్రజలు అవస్థలు పడ్డారు. కార్వాన్‌లోని లంగర్‌హౌస్, టోలిచౌకి, గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్‌లలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్, బీఆర్‌ఎస్ మాజీ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్ పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ప్రజలకు దరఖాస్తు ఫారాలను అందించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా నాంపల్లి నియోజకవర్గంలోని మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, గుడిమల్కాపూర్, మల్లేపల్లి, రెడ్‌హిల్స్, అహ్మద్‌నగర్ డివిజన్‌లలో నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ తిరిగి ప్రజా పాలన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రత్యేక అధికారి శ్రీవాత్సవ, ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

**అబిడ్స్‌లో...**

అబిడ్స్ : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా పాలనలో మరిన్ని మార్పులు చేయాలని దరఖాస్తుదారులకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు చేపట్టాలని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ అన్నారు. ప్రజా పాలనలో సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు కూడా పూర్తి స్థాయిలో లేవని, ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పించలేదని ఎమ్మెల్యే అధికారులకు వివరించారు. కాగా, గోషామహల్ నియోజకవర్గంలోని 6 డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు 4 కేంద్రాల చొప్పున 24 ప్రజా పాలన కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు గోషామహల్ నియోజకవర్గం ప్రత్యేక అధికారి గీతా రాధిక తెలిపారు.

– సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించడమే కాక ప్రజలకు వెంటనే సంక్షేమ పథకాలను అందించాలని గన్‌ఫౌండ్రి డివిజన్ మాజీ కార్పొరేటర్ మమత సంతోష్‌గుప్తా డిమాండ్ చేశారు. కాలయాపన చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రోజులకొద్దీ దరఖాస్తులు తీసుకుంటుందని ఆరోపించారు. బిర్లామందిర్ నవత్‌పహాడ్ ప్రాంతంలో దరఖాస్తుల కేంద్రాన్ని ఆమె పర్యవేక్షించారు.

– ప్రజా పాలన పేరుతో ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని ప్రముఖ న్యాయవాది, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వహీద్ అహ్మద్ అన్నారు. ప్రజా పాలనలో దరఖాస్తుల కోసం వచ్చే ప్రజలకు సరైన ఏర్పాట్లు చేయలేదని, అవసరమైన దరఖాస్తు ఫారాలు అందజేయలేదని విమర్శించారు. దీనివల్ల ప్రజలు పెద్ద సంఖ్యలో క్యూ లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు వెంటనే ప్రజలకు సరైన సౌకర్యాలు కల్పించాలని, లేని పక్షంలో డిసెంబర్ 30న భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు.



తానాజీనగర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది,అధికారులు

**కార్వాన్‌లో..**

కార్వాన్ : కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకంతో లబ్ధి పొందేందుకుగాను ప్రజలు తమతమ దరఖాస్తులు తీసుకొని ఉదయం నుంచే ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. అయితే జిరాక్స్ పత్రాలు అత్యవసరం కావడంతో ప్రజలు జిరాక్స్, మీ సేవ, ఆన్‌లైన్ సేవా కేంద్రాల వద్ద బారులు తీరారు. ఏ జిరాక్స్ దుకాణం వద్ద చూసినా క్యూ లైన్లే దర్శనమిచ్చాయి. మరోవైపు అధికారుల వద్ద ప్రజలకు సరిపడా దరఖాస్తులు లేకపోవడంతో జిరాక్స్ సెంటర్లను ఆశ్రయించాల్సి వచ్చింది. కొందరు రూ.10 ఒక దరఖాస్తు అందజేయగా, మరి కొందరు రూ.50–80 వరకు వసూలు చేసినట్లు తెలిసింది.



కార్వాన్ నానల్‌నగర్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు ఇవ్వడానికి వచ్చిన దివ్యాంగురాలితో మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్

**చాంద్రాయణగుట్టలో...**

చాంద్రాయణగుట్ట : చాంద్రాయణగుట్ట సర్కిల్–8 పరిధిలో ఏర్పాటు చేసిన 28 కేంద్రాల్లో కలిపి మొత్తం ఐదు గ్యారంటీల పథకల కోసం 6742 దరఖాస్తులు మొదటి రోజు వచ్చాయి. మిగితా వాటి కోసం మరో 1376 దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం కలిపి మొదటి రోజు ప్రజా పాలనలో 8100 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ వి.సురేందర్ తెలిపారు.కొన్నిచోట్ల దరఖాస్తు ఫారాలను అందజేయడానికి సాయంత్రం వరకు క్యూలై న్లో ఉన్నారు. జీరాక్స్ సెంటర్లలో రూ.10 నుంచి రూ.20 వరకు ఒక్కో ఫారం కొనుగోలు చేసి దరఖాస్తు చేసుకున్నారు. కొందరు దళారులు అయితే ఏకంగా రూ. 50 నుంచి రూ.100 వరకు దరఖాస్తు ఫారాన్ని విక్రయించారు.

**సుల్తాన్‌బజార్‌లో..**

సుల్తాన్‌బజార్: చాదర్‌ఘట్ విక్టోరియా ప్లేగ్రౌండ్‌లో నిర్వహించిన ప్రజా పాలన కేంద్రాన్ని స్పెషల్ ఆఫీసర్ గీత రాధిక, జీహెచ్‌ఎంసీ సర్కిల్ 14 డీసీ బాలయ్యలు పర్యవేక్షించారు. దరఖాస్తు ఫారాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మీ సేవా కేంద్రాలు, జీరాక్స్ సెంటర్లకు జనం పరుగులు తీశారు. చివరికి జిరాక్స్ దరఖాస్తు ఫారాలు తీసుకువచ్చి ప్రజలు దరఖాస్తులను సమర్పించారు. స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాశ్ బీష్వ, నాయకులు శైలేంధర్‌యాదవ్, గులాబ్ శ్రీనివాస్ తమ కార్యకర్తలతో కలిసి కేంద్రాలకు వచ్చిన ప్రజలకు దరఖాస్తులు నింపేందుకు సహకరించారు.

**జియాగూడలో..**

జియాగూడ : జియాగూడ డివిజన్ పరిధిలోని టూ బీహెచ్‌కే హౌసింగ్ కాలనీ, దుర్గానగర్, ఇమాంపురా, జోర్ బస్తీలోని శ్రీవీరు కక్కయ్య సమాజ్ తదితర ప్రాంతాల్లో గురువారం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం అధికారులు ప్రారంభించారు. టూహెచ్‌కె కాలనీలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



జియాగూడ టూ బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీ కమిటీ హాల్‌లో అభయహస్తం దరఖాస్తులు స్వీకరిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ**

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 28 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ అన్నారు. కలకత్తా నగరంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య సమావేశం సందర్భంగా గురువారం హైదరాబాద్ నుంచి ఆయన బయలుదేరారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## బాలుడు అదృశ్యం



బన్నీ(ఫైల్)

అబిడ్స్, డిసెంబర్ 28: ఇంటి నుంచి వెళ్లిన బాలుడు అదృశ్యమైన సంఘటన చోటుచేసుకున్నది. మంగళ్‌హాట్ ఆర్‌కే పేట్‌లోని గుఫానగర్‌కు చెందిన కె.బన్నీ(14) ఈనెల 23 నుంచి కనిపించకపోవడంతో బంధువులు మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.